## క్లుప్తంగా

### విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

రాజాం: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎంఈవో బి.ప్రవీణ్‌కుమార్, రాజాం రెడ్ క్రాస్ అధ్యక్షుడు కొత్త సాయిప్రశాంత్ కుమార్‌లు ఆకాంక్షించారు. ఈ నెల 14న బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక బాలభవన్‌లో విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. మొత్తం 450 మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరు కాగా, వారిని ఉద్దేశించి వారు మాట్లాడారు. ఈ పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉపయోగపడతాయన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి పలు రాష్ట్రాల్లో జరిగే బాలభవన్ వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బాలభవన్ డైరెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీటీసీ మృతి



పార్వతి(ఫైల్)

బొబ్బిలిరూరల్: మండలంలోని పిరిడి గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు కొల్లి పార్వతి(68) అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమె మృతి పట్ల తోటి ఎంపీటీసీ సభ్యులు సహా పలువురు రాజకీయ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపి, మృతురాలి ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు.

### ఆధార్ సేవల పరిశీలన



ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: మండలంలోని కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రం సేవలను ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అపార్ ఐడీకి సంబంధించి, ఆధార్ కార్డులో తప్పులను సవరించాలని సూచించారు. విద్యార్థులంతా త్వరితగతిన అపార్ నమోదు చేయించుకోవాలని తెలిపారు.

### చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

బొబ్బిలి: విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ స్థానిక గ్రోత్‌సెంటర్ దగ్గరి ఫెర్రోఎల్లాయిస్ కంపెనీ కార్మికుడు గేదెల రామారావు(45) గురువారం రాత్రి మృతి చెందాడు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. దత్తిరేజేరు మండలంలోని స్టేషన్ బూర్జివలసకు చెందిన రామారావు.. కంపెనీ మొదటి అంతస్తులో గురువారం పనిచేస్తుండగా, ప్రమాదవశాత్తు కిందిపడి గాయపడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వైద్యసేవల నిమిత్తం విజయనగరానికి తరలించగా, అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మరణించారు. మృతుడి భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం బాధిత కుటుంబానికి మృతదేహం అప్పగించినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.


### రుణాల రికవరీలో అలసత్వం వద్దు

వంగర: గ్రామైక్య సంఘాల పరిధిలో మంజూరు చేసిన రుణాల రికవరీలో అలసత్వం వహించవద్దని ఏపీఎం తెర్లి మంగమ్మ సూచించారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, వీవోఏలతో శుక్రవారం సమావేశమైన ఆమె.. స్త్రీనిధి, సీఐఎఫ్, హెచ్‌డీఎఫ్ తదితర రుణాలను రికవరీ చేయాలని తెలిపారు. గ్రామాల్లోని మహిళలకు అవసరమైన మేరకు రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు బి.రామలక్ష్మి, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం సేకరణపై శిక్షణ

బొబ్బిలిరూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వీఏఏలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు ధాన్యం సేకరణపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. సీఎస్‌డీటీ రెడ్డి సాయికృష్ణ మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి ధాన్యం సేకరణ సక్రమంగా చేపట్టాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. రైతుల నుంచి సేకరించే పంటల వివరాలు, రవాణా, బ్యాగుల ఖర్చులను కొనుగోలు కేంద్రాల వద్ద ప్రదర్శించాలన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాలన్నారు.

### వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాజాం సిటీ: మండలంలోని పెనుబాక గ్రామంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా శుక్రవారం నిర్వహించారు. కాశీవిశ్వేశ్వరాలయ వార్షికోత్సవం పురస్కరించుకుని, జెడ్పీటీసీ బండి నర్సింహులు, సర్పంచ్ బండి బోడెమ్మల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టి, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

## ● ఆయుర్వేదంతో వ్యాధుల నుంచి ఉపశమనం



ఆయుర్వేద వైద్యం సకల వ్యాధుల నుంచి ఉపశమనం కలిగిస్తుందని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. రేగిడి మండలంలోని ఖండ్యాం గ్రామంలో శుక్రవారం ఆయన నిర్వహించిన ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కీళ్లు, మోకాళ్లు, మెడ నొప్పులతో బాధపడుతూ శిబిరానికి హాజరైన వారికి ఉచితంగా మందులు అందజేసి, మెరుగైన ఆరోగ్యానికి సలహాలు, సూచనలిచ్చారు. ఆయుర్వేద సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. – రేగిడి

## ● నడకయాతన

ఈ చిత్రంలో కనిపిస్తున్నది.. రేగిడి మండలంలోని అప్పాపురం-లక్ష్మీపురం గ్రామాల బీటీ రోడ్డు. ప్రస్తుతం ఇది చాలా అధ్వానంగా తయారైంది. రోడ్డంతా గుంతలమయం కావడంతో ఆ వైపుగా వెళ్లేందుకు జనం తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా గర్భిణులను ఈ రోడ్డు మీదుగా ఆస్పత్రికి తరలించాలంటే నరకయాతన అనుభవిస్తున్నామని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు. – రేగిడి



## ● న్యాయమైన డిమాండ్లు పరిష్కరించండి



తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 104 వాహన ఉద్యోగులు బాడంగి మండల పరిషత్, తహసీల్దారు కార్యాలయాల వద్ద శుక్రవారం నిరసనకు దిగారు. వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలి. జీవో నంబరు 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దారు సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో 104 ఉద్యోగులు ఆర్.రామకృష్ణ, ఆర్.అప్పారావు, పి.తిరుపతినాయుడు, డి.మురళి తదితరులు పాల్గొన్నారు. – బాడంగి

# అధికారుల నిర్లక్ష్యం.. రైతుల పాలిట శాపం



సంతకవిటి: గండి పడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

- సురవరం వద్ద 28ఎల్ కాలువకు గండి
- వరి పొలాల్లోకి భారీగా చేరిన నీరు
- అప్పటికే చల్లిన అపరాలకు నష్టం
- వరి పంటకు కూడా కొంతమేర నష్టమే
- అధికారుల నిర్లక్ష్యం వల్లే దుస్థితి!
- ఆందోళనలో బాధిత రైతులు

సంతకవిటి: మండల రైతులకు ప్రధాన సాగునీటి వనరుగా ఉన్న మడ్డువలస కాలువలో అధిక నీటి ప్రవాహం కారణంగా ఇదే మండలంలోని సురవరం గ్రామం దగ్గరున్న 28ఎల్ కాలువకు గురువారం అర్ధరాత్రి గండి పడింది. దీంతో అక్కడి వరి పొలాల్లోకి పెద్దఎత్తున నీరు వచ్చి చేరింది. దీంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. పొలాల్లో అపరాలు సాగు నిమిత్తం వేసిన విత్తనాలు ఎందుకు పనికిరాకుండా పోతాయని, చేతికి అందివచ్చిన వరి పంట కూడా కొంతమేర నాశనమవుతుందని, కోతలు కూడా ఆలస్యమవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే నీరు ఎక్కువ కాలం అలానే పొలంలో ఉండిపోతే ధాన్యపుగింజలు రాలిపోయే ప్రమాదం ఉందంటున్నారు. కాలువకు గండి పడిన ప్రదేశంలోని లోపాలను అధికారులు గుర్తించకపోవడం వల్లే ఈ దుస్థితి కలిగిందని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం తమ పాలిట శాపంగా మారిందని వాపోతున్నారు. గండి పడిన ప్రదేశానికి కూతవేటు దూరంలో మరో గండి పడుతుందనే సమయంలో అక్కడి రైతులు అప్రమత్తమయ్యారు. మట్టితో గండిని పూడ్చి పెను ప్రమాదం నుంచి గట్టెక్కించారని మిగిలిన రైతులు చెబుతున్నారు.

**జేసీబీ సాయంతో పూడ్చివేత..**

కాలువకు గండి పడిన ప్రదేశాన్ని సర్పంచ్ గంటా షణ్ముఖరావు, జి.ఎస్.పురం సర్పంచ్ పప్పల ఈశ్వరరావులతో పాటు ఈఈ కె.వెంకటేశ్వర్లు, డీఈ ఈశ్వరప్రసాద్, ఏఈ వెంకటరమణలు శుక్రవారం పరిశీలించారు. ప్రధాన కాలువ నుంచి 28ఎల్ కాలువకు నీరు వెళ్లకుండా షట్టరును పూర్తిగా కిందికి దించారు. అయినప్పటికీ ఆ షట్టరు పైనుంచి నీరు కాలువలోకి పరుగులు పెట్టింది. దీంతో గండి పూడ్చే చర్యలు ఆలస్యం కాగా శుక్రవారం సాయంత్రానికి జేసీబీ సాయంతో గండి పూడ్చివేత పనులు పూర్తి చేశారు.

**అక్కడ అలా.. ఇక్కడ ఇలా..**

28ఎల్ కాలువకు గండి పడి ఇక్కడి పంటలకు నష్టం కలిగితే.. ఇదే కాలువ పరిధిలోని జి.ఎస్.పురం, సిరిపురం, జానకీపురం తదితర గ్రామాల పంటపొలాలకు సాగునీరందక అక్కడి పంటలు పూర్తిగా ఎండిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. గురువారం రాత్రి కాలువ ద్వారా నీరు వస్తుందని ఆశించిన రైతులకు సురవరం దగ్గర కాలువకు పడిన గండి.. వారిని తీవ్ర నిరాశలోకి నెట్టింది. గండి పడిన కారణంగా షట్టరు దించివేయడంతో నీరు రాకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.



సంతకవిటి: జేసీబీ సాయంతో గండి పూడ్చుతున్న దృశ్యం



సంతకవిటి: మరోచోట కాలువకు గండి పడకుండా మట్టిదిబ్బలు ఏర్పాటు చేసిన రైతులు

### బ్రిడ్జి నిర్మించాలి..



సురవరం దగ్గర కాలువకు గండి పడిన ప్రదేశంలో బ్రిడ్జి నిర్మించాలి. అలా అయితేనే గండి పడే ప్రమాదం ఉండదు. గండి పడిన ప్రాంతం రోడ్డు క్రాసింగ్ కావడంతో మళ్లీ ఎప్పుడైనా అదేచోట గండి పడేందుకు ఆస్కారం ఉంది. అదేచోట వంతెన నిర్మిస్తే గోవిందపురం, వెంపలపేట తదితర గ్రామాలకు రోడ్డు సమస్య కూడా తీరుతుంది.
– గంటా షణ్ముఖరావు, సర్పంచ్, సురవరం



సంతకవిటి: వరి పొలాల్లోకి దూసుకెళ్తున్న కాలువ నీరు



సంతకవిటి: జి.ఎస్.పురంలో ఎండిపోయిన పంటపొలాలు

# సక్రమంగా ఎన్నికలు నిర్వహించాలి

తెర్లాం: నీటి సంఘాల ఎన్నికలను సక్రమంగా నిర్వహించాలని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్, ఎంపీడీవో ఆర్.రాంబాబు సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఇరిగేషన్ ఏఈ హరి ఆధ్వర్యంలో నీటి సంఘాల ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ నియమ, నిబంధనలను అనుసరించి ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎటువంటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఇరిగేషన్ ఏఈ హరి కోరారు. కార్యక్రమంలో ఎంఈవో త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: సాగునీటి సంఘాల ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు మల్లెపురెడ్డి శ్రీను సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మండలంలో 13 చిన్నతరహా, మధ్యతరహా సాగునీటి వనరులున్నాయని, వాటి పరిధిలోని సాగునీటి సంఘాలకు ఎన్నికలను ఈ నెల 21వ తేదీన జరగనున్నాయని తహసీల్దారు పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రవికుమార్, ఎంఈవో లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



తెర్లాం: శిక్షణకు హాజరైన ఎన్నికల సిబ్బంది

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికల సిబ్బందికి శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ఏ విధంగా నిర్వహించాలన్న విషయాలను ఇరిగేషన్ ఏఈ రాజశేఖర్, తహసీల్దారు సుధాకర్, ఎంపీడీవో రామకృష్ణలు వివరించారు.

# గుంతల పూడ్చివేత

రామభద్రపురం: మండల కేంద్రంలో రామభద్రపురం-రాజాం రోడ్డుతో పాటు రామభద్రపురం గ్రామం మధ్య నుంచి సాలూరు వెళ్లే రహదారిలోని గుంతలను పూడ్చివేసే చర్యలు శుక్రవారం చేపట్టారు. ఆయా రోడ్ల అధ్వాన పరిస్థితులపై గుంతలు పూడ్చండి సారూ.. అనే శీర్షిక పేరిట ఈ నెల 7వ తేదీన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనానికి పోలీసులు స్పందించి, స్టోన్ క్రషర్ యజమాని బొబ్బాది శేఖర్ సహకారంతో సీఐ నారాయణరావు ఆధ్వర్యంలో రాజాం రోడ్డులోని పెద్దపెద్ద గుంతలను పిక్కరాళ్లు, సిమెంట్ కలిపి పూడ్చారు. ఇదంతా చూసిన వాహనదారులు హమ్మయ్యా.. గుంతలు పూడ్చారు అని అనుకుంటున్నారు.



రామభద్రపురం-రాజాం రోడ్డులోని గుంతలను పూడ్చివేయిస్తున్న సీఐ నారాయణరావు

# మృతుడి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి

బొబ్బిలి: స్థానిక గ్రోత్ సెంటర్‌లోని ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీ ప్రమాదంలో మృతి చెందిన రామారావు కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై మండల కేంద్రంలోని విలేకరులతో శుక్రవారం మాట్లాడిన ఆయన.. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పరిశ్రమల్లో కార్మికుల రక్షణకు చేపట్టే చర్యల పర్యవేక్షణకు అధికారులను కొంతమంది రానివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. చుట్టుపక్కల గ్రామాల నాయకులతో ఒప్పందాలు కుదుర్చుకుని మరీ కార్మికులకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి, తక్షణమే బాధిత కుటుంబానికి పరిహారం అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ఎస్.గోపాలం, పుణ్యవతి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు శంకరరావు

# గంజాయి కేసులో పరారైన ఎ3 నిందితుడి అరెస్టు

రామభద్రపురం: గంజాయి అక్రమ రవాణా చేస్తూ 2019 జూన్ 17 వ తేదీన పోలీసులను తప్పించుకుని పరారైన ఎ3 నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆ కేసుకు సంబంధించి సీఐ కె. నారాయణరావు విలేకరుల సమావేశంలో తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. 2019 జూన్ 17న విశాఖ జిల్లా పెదబయలు మండలం తామర వీధి గ్రామం నుంచి 171 కిలోల ఉన్న గంజాయిని ఐషర్ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తుండగా కొట్టక్కి పెట్రోల్ బంకు సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. అయితే అప్పట్లో ఎ 1 నిందితుడు వెల్లంగి రమేష్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి విచారణ చేయగా విశాఖ జిల్లా పెదబయలు మండలంలో నక్సల్స్ సంచరించే అతిప్రమాదకరమైన తామర వీధి గ్రామం నుంచి విశాఖపట్నం వైపు గంజాయి తరలిస్తున్నట్లు అంగీకరించాడు. ఈ కేసులో ఎ 2,ఎ 3,ఎ 4 నిందితులు పరారయ్యారు. అయితే మూడేళ్ల తర్వాత 2022లో ఎ 4 నిందితుడు జంపరంగి గిరీష్‌కుమార్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.పట్టుబడిన అక్రమ గంజాయిపై కేసు నమోదై ఐదేళ్లు దాటుతుంది.ఇప్పుడు కేసులు,అరెస్టులు ఉండవన్న ఉద్దేశంతో ఎ3 నిందితుడు చందా రాజశేఖర్ రామభద్రపురం బైపాస్ రోడ్డులో పోలీసు చెక్‌పోస్టు, పోలీసుల కదలికలు, బైపాస్‌లో చెక్ పోస్టు ఉందో లేదో పరిశీలిస్తూ పోలీసులకు శుక్రవారం పట్టుబడ్డాడు. దీంతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకోగా డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నారాయణరావులు విచారణ చేశారు. ఎ 2 నిదితుడితో పాటు అల్లూరిసీతారామ రాజు జిల్లా పెదబయలు మండలానికి చెందిన మరో కీలక వ్యక్తికి ఈ కేసులో సంబంధం ఉన్నట్లు తెలిసింది.అరెస్టు చేసిన రాజశేఖర్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎ 2 నిందితుడితో పాటు మరో కీలక వ్యక్తి కోసం గాలిస్తున్నారు.



ఎ 3 నిందితుడు రాజశేఖర్‌ను అరెస్టు చేసిన సీఐ నారాయణరావు తదితరులు

# దొంగకు సహకరించిన వ్యక్తి అరెస్టు

రాజాం సిటీ: వ్యసనానికి బానిసైన ఓ వ్యక్తి మరో వ్యక్తికి దొంగతనంలో సహకరించి పోలీసులకు చిక్కాడు. ఈ నెల 2న స్థానిక పాలకొండ రోడ్డులోని మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస లక్ష్మీనగర్‌లో సలాది శేషగిరి ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో బలిజిపేట మండలంలోని పణుకువలస గ్రామానికి చెందిన గుజ్జల సుధాకర్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి రాజాం రూరల్ సర్కిల్ కార్యాలయంలో చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. సుధాకర్‌కు ఇటీవల వివాహం కావడంతో రాజాంలోని స్టైల్ బజార్ వస్త్రదుకాణంలో పనిలో కుదిరాడు. వ్యసనానికి బానిస కావడంతో అవసరానికి సరిపడా సొమ్ములు లేక ఆ పనికూడా మానేశాడు. బార్‌లో పరిచయమైన ప్రధాన నిందితుడితో కలిసి దొంగతనానికి అలవాటుపడ్డాడు. తనకు సహకరించాలని ప్రధాన నిందితుడు అడగడంతో సరేనన్నాడు. ఈ క్రమంలో తాళం వేసి ఉన్న శేషగిరిరావు ఇంట్లో ఈ నెల 2న దొంగతనానికి పాల్పడి బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. దీంతో రంగంలో దిగిన క్లూస్‌టీమ్ వేలిముద్రలు, సీసీ కెమెరాల ఆధారంగా ప్రధాన నిందితుడికి సహకరించిన సుధాకర్‌ను పట్టుకుని 10 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదని, త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాఘవులు, వెనుక ముసుగులో అరెస్టయిన వ్యక్తి

### వాహన తనిఖీలు

రాజాం సిటీ:

మద్యం అక్రమ రవాణా అరికట్టేందుకు వాహన తనిఖీలు ముమ్మరం చేశామని ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ అన్నారు. మండలంలోని బొద్దాం, పొగిరి గ్రామాల రోడ్లపై శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ బెల్టుషాపుల నిర్వహణ జరగకుండా ప్రత్యేక దృష్టిసారించామన్నారు. ఎవరైనా మూడు మద్యం సీసాల కంటే ఎక్కువ రవాణా చేస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు వారి వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జి.మాన్యాలు తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్య సూత్రాలు పాటించాలి

రేగిడి: ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి రోహిణీ రాఘవ్ సూచించారు. మండలంలోని వండానపేట గ్రామ అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరానికి హాజరైన వారికి ఆమె ఆరోగ్య తనిఖీలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం మెరుగైన ఆరోగ్యానికి పలు సూచనలు చేశారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వంగర: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాంటప్పుడే వ్యాధుల బారినపడకుండా ఉంటామని తహసీల్దారు దిరిశాల ధర్మరాజు, ఎంపీడీవో లోపింటి త్రినాథ్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో శుక్రవారం వారు సమావేశమై, మాట్లాడారు. గ్రామాల్లోని ప్రజలకు ఇంటి ఆవరణలో మురుగునీటి నిల్వలు లేకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే బహిరంగ మలవిసర్జనను బహిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తోటపల్లి, మడ్డువలస గొర్లె శ్రీరాములు నాయుడు ప్రాజెక్టుల పరిధిలోని సాగునీటి సంఘాల ఎన్నికలపై తహసీల్దారు సమీక్షించారు. ఈ నెల 21వ తేదీన నీటి సంఘాల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈలు డి.వి.రమణ, జి.అనిల్, పీఆర్ ఏఈ ప్రభాకర్, ఈవోపీఆర్‌డీ కె.రామారావు, ఆర్‌ఐ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయానికి ‘ఉపాధి’ని అనుసంధానించాలి

బొబ్బిలిరూరల్: వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానించాలని జిల్లా రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు కోరారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద రైతు సంఘం నాయకులతో శుక్రవారం ఆందోళనకు దిగారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు కూలీలు దొరకడం లేదని, దీంతో వారు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వ్యవసాయానికి ఉపాధి పథకాన్ని అనుసంధానిస్తే వేతనదారులే కూలీల అవతారమెత్తి వ్యవసాయ పనులు చకచకా జరుగుతాయన్నారు. దీంతో రైతులకు కూలీల కొరత తీరుతుందని, వేతనదారులకు డబ్బులు కూడా బాగా వస్తాయన్నారు. అనంతరం తహసీల్దారు శ్రీనుకు వినతిపత్రం అందజేశారు.




ఆందోళన చేస్తున్న రైతు సంక్షేమ సంఘం నాయకులు

### పౌష్టికాహారం తీసుకోవాలి

రేగిడి: ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఎంపీడీవో శ్యామలాకుమారి సూచించారు. మండలంలోని ఉనుకూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి, పలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందజేయాలని తెలిపారు. అలాగే పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలన్నారు.

## సంక్షిప్తంగా...

**దివ్యజీవన సత్సంగ సమావేశం**

రేగిడి: మండలంలోని దేవుదళ గీతా మందిరంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో దివ్యజీవన సత్సంగ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రస్తుతం బిజీ జీవితంలో పడి మానసిక ప్రశాంతత కోల్పోతున్నారని, మానసికంగా సంతోషంగా ఉండాలంటే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో దామోదరరావు, మోహన్‌దాస్, అప్పలరాం, నిత్యస్మరణానందస్వామి తదితరులు పాల్గొన్నారు.

**అప్రమత్తంగా ఉండాలి**

బొబ్బిలిరూరల్: సీజనల్ వ్యాధుల బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో పి.రవికుమార్ సూచించారు. మండలంలోని గొర్లెసీతారాంపురంలో వైద్యారోగ్య సిబ్బందితో కలిసి శుక్రవారం పర్యటించిన ఆయన.. ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులు–వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. మరుగునీటి నిల్వలు ఉండకుండా చూడాలని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎ.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

**బెల్టుషాపు నిర్వాహకులపై బైండోవర్ కేసులు**

రాజాం సిటీ: రేగిడి, రాజాం మండలాల్లో అక్రమంగా మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తున్న ఆరుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ శుక్రవారం తెలిపారు. పట్టుబడిన వారిలో రాజాం మండలంలోని పొగిరి గ్రామానికి చెందిన ఇద్దరు, గడిముడిదాం గ్రామానికి చెందిన ఒకరు, బొద్దాం గ్రామానికి చెందిన మరొకరు, రేగిడి మండలంలోని సరసనాపల్లి, బూరాడ గ్రామాలకు చెందిన ఇద్దరు ఉన్నారన్నారు. తహసీల్దార్ల ఎదుట వారిని హాజరుపరిచి, మరోసారి పట్టుబడితే రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించామన్నారు.

**నేడు, రేపు ఓటర్ల జాబితాలో సవరణలు**

బొబ్బిలి: మండల పరిధిలోని పోలింగ్‌స్టేషన్‌లలో శని, ఆదివారం ఓటర్ల జాబితాలో తప్పులను సవరించనున్నట్లు ఎన్నికల డీటీ బలివాడ గౌరీశంకర్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు పాత ఓటరు జాబితాలోని ఓటర్ల వివరాల్లో ఏవైనా తప్పులుంటే వాటిని బీఎల్‌వోలు సరి చేయడం జరుగుతుందన్నారు.

రాజాం: ఓటర్ల జాబితాలో తప్పుల సవరణ నిమిత్తం ఈ నెల 9, 10వ తేదీలతో పాటు 23, 24వ తేదీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టే ఓటరు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎల్.జోసెఫ్ శుక్రవారం తెలిపారు. అలాగే 18 ఏళ్ల వయసు నిండిన వారంతా ఓటర్లుగా నమోదు కావాలన్నారు.

**ముగడలో ‘ఉపాధి’ పనులు**



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: మండలంలోని ముగడ గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పనులను ఎంపీడీవో ఎస్.రామకృష్ణ పరిశీలించి, వేతనదారులకు పలు సూచనలు చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని తెలిపారు.